# బిస

శంభులింగం ఎత్తు ఇంకో అంగుళం వుంటే ఆరడుగులు బాగా తింటాడేమో బరువు మాత్రం రెండొందల పౌన్లుదాటి మరో అయిదుంది అర్జంటు పనిమీద మద్రాసు బయల్దేరాడో రోజు విజయవాడ ప్లాట్‌ఫారం పైకొచ్చాడు టిక్కట్టు కొనుక్కొని మద్రాసు వెళ్ళే రైలు రావడానికింకో గంట పైముంది ప్లాట్‌ఫాంపై షికార్లు చేస్తూన్న శంభులింగానికి ప్రక్క ప్రక్కనే వున్న రెండు 'బరువు తూచుకొనే యంత్రాలు' కన్పించాయి ఒకదాంట్లో పది పైసలకే బరువు తెలుసుకోవచ్చు 'మీ బరువుతోపాటు మీ కాశ్చర్యం కలిగించేలా మీ గురించిన వివరాలు' చెప్తానంటున్న రెండో మిషన్లో యాభై పైసలు వెయ్యాలని రాసివుంది శంభులింగం యాభై పైసలు వేసి మిషన్ ఎక్కాడు 'బొయ్' మంటూ రెండు నిమిషాలు మోగి ఓ చీటీ బయట కొచ్చింది 'మీ ఎత్తు 5 అడుగుల 11 అంగుళాలు, బరువు 205 పౌన్లు మీరు మద్రాసు రైలు కోసం ఎదురు చూస్తున్నారు' అని రాసి వుందా కాగితంపైన శంభులింగానికి నమ్మకం కుదరలేదు తన గురించి ఎవరేనా ముందే కూపీలాగి ఇలా రాసిపెట్టేశారేమోనన్న అనుమానం వచ్చింది దారే పోతున్న ఓ పోర్టరుని పిలిచి 'బాబ్బాబు నీకు రూపాయిస్తా, ఓ అర్ధరూపాయిచ్చి ఆ మిషనెక్కు' అన్నాడు శంభులింగం పోర్టరు రూపాయి జేబులో వేసుకొని జేబులోంచి అర్ధరూపాయి తీసి మిషన్లో వేసి నిలబడ్డాడు మిషన్‌లోంచి వచ్చిన కాగితంలో 'నీ పేరు పోతురాజు, నీ ఎత్తు 'ఫలానా' అంత, నీ బరువు 'ఇన్ని కిలోలు నువ్వు విజయవాడ స్టేషన్‌లో పోర్టర్ పని చేసుకొంటున్నావు' అని వుంది

శంభులింగానికి ఆ యంత్రం అంతు తేల్చుకోవాలనిపించింది గబగబా స్టేషన్ బయటకి వచ్చాడు పెరిగిన గెడ్డం నున్నగా గీయించుకొని అందంగా తయారయ్యాడు నల్ల కళ్ళద్దాల జోడు కొనుక్కొని పెట్టుకొన్నాడు వంటిమీద బట్టలు బాగ్‌లో కుక్కి కొత్త బట్టలు తీసి కట్టుకొన్నాడు ఒక టోపీ కూడా పెట్టుకొని అంతకు ముందు తనను చూసినవాళ్ళు గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు మళ్ళీ వచ్చి స్టేషన్‌లోని ఆ యంత్రం దగ్గరకెళ్ళి యాభై పైసలు వేసి నించున్నాడు కాగితం వచ్చింది ఆత్రంగా చూశాడు శంభులింగం "మీ ఎత్తు 5 అడుగుల 11 అంగుళాలు, బరువు 205 పౌన్లు మీరు వేషం మార్చినా మద్రాసే వెళ్ళాలి మూర్ఖుడా అలా తెల్లబోయి చూడకు నీ వెళ్ళాల్సిన రైలు వెళ్ళి పది నిమిషాలయిందని తెలిసి మరింత తెల్లబోవలసి వుంది నువ్వు!" అని రాసి వుంది

—భవాని